# హెచ్చరిక



*ఆస్వాదిత మజ్ఞాతేన*
*యావత్తదే చిరంవ్రీహీణాం*
*ఉపశమ వృషభేదీనాం*
*రక్షతే గృహపతిక్షేత్రం*

*భావం:* చాలాకాలం నుండి ఇక్కడ ధాన్యాన్ని ఎవరికీ తెలియకుండా తింటున్నావు. వృషభమా, ఇంక మానెయ్యి. యజమాని క్షేత్రాన్ని రక్షిస్తున్నాడు.

వివాహమైన కొత్తలోనే ఒక సుందరాంగి భర్త వ్యాపారం చెయ్యడానికి దేశాంతరం బయల్దేరాడు. ఆమెకు కోపం వచ్చింది. భూవసతి ఉంది. వడ్డీ వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయముంది. అందమైన ఇల్లుంది. ఇంకా ధనార్జన అవసరమేముందని ఆమె వాదన. 'నిర్వ్యాపారత్వం కా పురుష లక్షణమ' ని మహాభారతంలో ఉంది. ఏ పనీ చెయ్యకుండా తిని కూచుంటే కొండలైనా కరిగిపోతాయి. మనస్సుకి పిచ్చి ఎక్కుతుంద'ని అతనన్నాడు. 'అయితే నేను ఏ పనీ లేకుండా ఇంట్లో కూచోవాలా' అని ఆమె అంది. 'అలాగని నేను అనలేదు. పొలం పనుల అజమాయిషీ చెయ్యి' అని చెప్పి అతను విదేశాలకు వ్యాపార నిమిత్తం వెళ్ళిపోయాడు.

ఆమె ఇంటి పనీ, పొలం పనీ చూసుకునేది. కొంతకాలం దాకా భర్తకి దూరంగా ఉన్నందుకు బాధపడింది. అపైన భర్త మీద కోపం వచ్చింది. వ్యాపార నిమిత్తమని చెప్పాడు కానీ విలాసాల నిమిత్తమే అయి ఉంటుంది. అతనక్కడ సుఖపడుతూంటే నేనిక్కడ ఎందుకు బాధపడాలి అనుకుంది. ఆమెలో అటువంటి ఊహ వచ్చిన కొన్ని రోజులకే ఒకతనితో పరిచయం ఏర్పడింది. పొలంలో సంకేత స్థలం ఏర్పాటయింది.

ప్రతిరోజూ పొలానికి వెళ్ళేది. సాయంత్రం పొలం పనులయి పనివాళ్ళు ఇంటికి వెళ్ళిపోయేవారు. రాత్రి కాపలాకి ఎవరూ వద్దనీ, తానే ఉంటాననీ పని వాళ్ళందరినీ పంపేసి, ప్రియుడితో సరస సల్లాపాలతో గడిపేది. కొన్నాళ్ళకి భర్త వ్యాపారంలో లాభాలతో తిరిగి వచ్చాడు. ఇంటి బాధ్యతా, పొలం బాధ్యతా భార్య సక్రమంగా చూస్తున్నదని సంతోషించాడు. ఒకసారి పొలం చూస్తానన్నాడు. 'అలసిపోయి వచ్చారు. రేపు చూద్దురుగాని' అందామె. కాదు కూడదని భర్త ఆమెతో బయల్దేరాడు.

సాయంత్రమౌతోంది. ప్రియుడికి వార్త చేరవేసే మార్గం లేదు. ఆమె గుండె వేగంగా కొట్టుకుంటోంది. దూరంగా ప్రియుడు పొలం వైపు వస్తూ కనపడ్డాడు. ' నాభర్త వచ్చేశాడు. నువ్వు వెళ్ళిపో' అని ఎలా చెప్పాలి?

ఆమె అదృష్టం కొద్దీ ఒక అంబోతు పొలంలోకి రాబోయింది. ఆమె వెంటనే 'చాలా కాలం నుండి ఇక్కడ ధాన్యాన్ని ఎవరికీ తెలియకుండా తింటున్నావు. వృషభమా, ఇంక మానెయ్యి, యజమాని క్షేత్రాన్ని రక్షిస్తున్నాడు' అని బిగ్గరగా అంది. క్షేత్రమన్న మాటకి పొలం, భార్య అని రెండు అర్థాలున్నాయి. 'ఇంతకాలంగా ఎవరికీ తెలియకుండా నాతో సుఖపడ్డావు. ఇంక మానెయ్యి. నా భర్త నాకు కాపలాగా ఉన్నాడు.' అన్న అర్థం గ్రహించి, ఆమె హెచ్చరికను అర్థం చేసుకుని ప్రియుడు వెనక్కి వెళ్ళిపోయాడు.

నా భార్య ఆంబోతులు ధాన్యం తినకుండా పొలాన్ని బాగా చూసుకుంటోందని భర్త సంతోషిస్తే మంచిదే. కానీ ఆంబోతుని కర్రతో అదిలించాలి కానీ పద్యం చదివి పంపెయ్యగలమా అన్న అనుమానం భర్తకి వస్తే... పర పురుషుణ్ణి కోరుకునే ప్రతి పడతికీ ఈ కథ హెచ్చరిక కాదా?

******